సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
సోమవారం, జూలై 01, 2024
డిజిటల్



## మరో మూడు రోజులు

బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 7.6 కి.మీ ఎత్తులో నైరుతి దిశగా కొనసాగుతుందని పేర్కొన్నది. అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మరో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదివారం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ముల్కపల్లేలో అత్యధికంగా 9.12 సెం.మీ, భద్రాచలంలో 7.33 సెం.మీ, జూలూరుపాడ్‌లో 6.26 సెం.మీ, చంద్రుగొండలో 6.15 సెం.మీ, కొత్తగూడెంలో 5.57 సెం.మీ, చుంచుపల్లిలో 5.32 సెం.మీ, అశ్వాపురంలో 5.51 సెం.మీ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైన్‌పూర్‌లో 5.74 సెం.మీ, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో 5.61 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో 6.72 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్ ముగిసేటప్పటికీ 159 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం ఆదిలాబాద్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, మహబూబాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

- తెలంగాణ ప్రభ, హైదరాబాద్

# భారీ వర్షాలు

### బంగాళాఖాతంలో అల్పపీడనం

## రాహుల్.. 2లక్షల ఉద్యోగాలేవీ?

జాబ్ క్యాలెండర్ ఎక్కడ? బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3 లో



## ఎస్‌జీటీ ఖాళీలన్నీ బదిలీల్లో చూపించాలి

- ఆప్షన్స్ గడువును పొడిగించాలి
- సీనియారిటీ జాబితాల్లో తప్పులు సవరించాలి
- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్ డిమాండ్

3 లో

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
WANTED
సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్: 99854 44342

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కోరుట్ల పురపాలక కౌన్సిల్ అత్యవసర సమావేశం
- వర్షకాల నేపథ్యంలో నిధుల మంజూరుకు తీర్మానానికి



**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన ఈరోజు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో 34 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా పట్టణంలో అన్ని వార్డులలో రోడ్లపై గల గుంతలను మొరంతో నింపుటకు రూ.5లక్షలు, నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయుటకు రూ.5లక్షలు, శానిటేషన్ నిర్వహణ కొరకు రూ.10లక్షలు, పట్టణంలోని 33 వార్డులలో మురుగు కాలువల పైన స్లాబ్ కల్వర్టులు నిర్మించుటకు రూ.15లక్షలు కేటాయించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా డ్రైనేజీలు బాగు చేయించాలని, తాగునీటి వసతి కల్పించాలని చైర్ పర్సన్ ను కోరినారు. అందుకు బదులుగా చైర్ పర్సన్ శ్రీమతి అన్నం లావణ్య మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యుల కోరిక మేరకు పట్టణ ప్రజలకు ప్రస్తుత వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొనుటకు అధికారులకు ముందుగానే ఆదేశాలు జారీ చేయడం జరిగినదని తెలిపారు. సమావేశంలో చైర్ పర్సన్ శ్రీమతి అన్నం లావణ్య, వైస్ చైర్మన్ గడ్డమిది పవన్, మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి, అధికారులు లక్ష్మి , ప్రవీణ్, రమ్య, గజానంద్, వార్డ్ కౌన్సిలర్స్, కో ఆప్షన్ – మెంబెర్స్, విద్యుత్ శాఖ అధికారులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఔదార్యం చాటిన మున్సిపల్ కమిషనర్ తిరుపతి

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో జవాన్ గా పని చేసె గంగరాజం అనే కార్మికుని పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ బట్టు తిరుపతి జవాన్ గంగరాజం చేసిన సేవలను గుర్తు చేశారు. అనంతరం పూల మాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమీషనర్ తిరుపతి కారులో సొంత డ్రైవింగ్ లో జవాన్ గంగరాజంను ఎక్కించుకొని తన ఇంటికి మర్యాదపూర్వకంగా తీసుకెళ్ళి ఔదార్యాన్ని చాటాడు. ఇలా చేయడం పట్ల పలువురు కమీషనర్ తిరుపతి ని అభినందించారు.



## పిల్లిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

**తెలంగాణ ప్రభ, (రాజన్న సిరిసిల్ల) :** సిరిసిల్ల పట్టణం లోని శివాలయం వద్ద సాదు జంతువు చేతిబావిలో పడిపోయింది. శివాలయం వద్ద గల మోహన మూ ర్తి ఈ విషయాన్ని ఫైర్ సిబ్బందికి తెలియ చేయడం తో అగ్నిమాపక సిబ్బంది వచ్చి బావిలో దిగి సాదు జంతువును కాపాడారు. సాధు జంతువు పిల్లిని కాపాడినందుకు కుటుంబ సభ్యులు అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెస్క్యూ ఆపరేషన్ లో అగ్నిమాపక అధికారి ఎన్ నరేందర్, పి మహిపాల్( లీడింగ్ ఫైర్ మాన్) సబీర్,( ఫైర్ మాన్) ఎల్ నవీన్ కుమార్,( డ్రైవర్ ఆపరేటర్) హోంగార్డ్ హఫీజ్ పాల్గొన్నారు.

## మగ్దుంనగర్‌లో ఏర్పాటుచేసిన రోడ్డు సూచిక బోర్డులు ప్రారంభం

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దుంనగర్ లో ఏర్పాటు చేసిన రోడ్డు సూచిక బోర్డులను ఆదివారం డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూచిక బోర్డుల ను ఏర్పాటు చేయడం వలన ప్రతి ఒక్కరికి అడ్రస్ తెలుసుకోవడం సులభతరం అవుతుందన్నారు. ముఖ్యంగా అంబులెన్స్ లాంటి ఎమర్జెన్సీ సర్వీసుల కే కాకుండా పోస్టల్ డిపార్ట్మెంట్ తదితర సర్వీసులకు సైతం చిరునామా వెతకడం చాలా సులభంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మగ్దుంనగర్ కమిటీ అధ్యక్షులు, నిడిగొండ లక్ష్మణ్, మాజీ వార్డ్ మెంబర్, మహమూద్, శంకర్, రాయి రాజేష్, వినోద్ కుమార్, సత్య రాజు, సత్తిరెడ్డి, శ్రీనివాస్, ప్రభు, భాస్కర్, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్, సునీల్‌రెడ్డి, ఆంజనేయులు, వినోద్, మైలారం రాజ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.





## పాఠశాల పక్కన గుంత పూడ్చాలి

### గుంత ప్రాంతాన్ని పరిశీలించిన సీపీఎం నేత

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల పక్కన గల ప్రమాదకర గుంతను పూడ్చి వేసి విద్యార్థులకు రక్షణ కల్పించాలని సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి గుంత ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వం ఏడు కోట్లతో రెసిడెన్షియల్ పాఠశాల భవనం నిర్మించి, గుంత పూడ్చడం మర్చిపోయారన్నారు. సుమారు 350 మంది విద్యార్థులకు గుంత యమగండంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరగకముందే ప్రభుత్వం, అధికారులు మేల్కొంటే బాగుంటుందని పేర్కొన్నారు. వర్షపు నీరుతో గుంత నిండితే విద్యార్థులతో పాటు, పశువులకు ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో హోమము

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలోని రచ్చగల్లలోని ముదిరాజ్ సంఘ కళ్యాణ మండపంలో రాజు పంతులు చేత ముదురాజ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హోమము, యజ్ఞము, కల్యాణోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో బాగ్స్, బుక్స్ పంపిణీ

### కల్పతరువు ఫౌండేషన్



**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** నిజమాబాద్ జిల్లా కోటగిరి మండల పరిధిలోని ఎక్లాస్‌పూర్, రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో , కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని సిరి సముందర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో హైదరాబాద్ కు చెందిన కల్పతరువు ఫౌండేషన్ ఫౌండర్ అయినటువంటి డాక్టర్ భానుశిరీష శేషు కుమార్ దంపతులు సుమారు 60 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులతో పాటు 22 మందికి పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతిరోజు ఒకరికి సహాయం చేయాలనీ (హెల్ప్ వన్ పర్సన్ ఎవరీ డే), వాళ్ళకు జీవితంలో ఉపయోగపడేటువంటి విషయాలను ,తల్లిదండ్రులకు ప్రకృతిని కాపాడాలనే ఉద్దేశ్యంతో వంటశాలలో ఉపయోగించే కూరగాయల వేస్టేజ్ తో వచ్చే (బయోఎంజైమ్)తయారీ విధానం వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్. భాను శిరీషతో పాటు ఆమె స్నేహితులైన జూనియర్ లెక్చరర్ పొమ్మెడి లక్ష్మణ్ , ఏకం యోగ వెల్నెస్ ఫౌండర్ ప్రదీప్ కుమార్, యోగ ట్రైనర్ సాయిలను శాల్వలతో ఘనంగా సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ మోహన్, ఉపాధ్యాయులు రాజు , సిరి సముద్రం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు విమల, రాంపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

# ఎస్‌జీటీ ఖాళీలన్నీ బదిలీల్లో చూపించాలి

- ఆప్షన్స్ గడువును పొడిగించాలి
- సీనియారిటీ జాబితాల్లో తప్పులు సవరించాలి
- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పాకాల శంకర్ గౌడ్ డిమాండ్



**తెలంగాణ, ప్రభ, (సిరిసిల్ల) :** సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయుల బదిలీలకు వేలాది పోస్టులను బ్లాక్ చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేయడాన్ని టీఎస్ యూటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్ ఖండించారు. రేషనలైజేషన్ పై విధానపరమైన నిర్ణయం తీసుకోకుండా విద్యార్థుల సంఖ్యననుసరించి అదనపు పోస్టులను బ్లాక్ చేసిన విద్యాశాఖ అవసరమైన పాఠశాలలకు అదనపు పోస్టులను మాత్రం కేటాయించటం లేదన్నారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ లో లేని హేతుబద్ధీకరణను మధ్యలో జొప్పించి కేవలం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే అమలు చేయటం గందరగోళానికి గురిచేస్తోందన్నారు. కోర్టు కేసులను బూచిగా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్జీటి లకు ఆప్షన్ గడువును ఒక్క రోజే ఇచ్చి హడావుడిగా ముగించాలని చూడటం సమంజసం కాదని హితవు పలికారు. సీనియారిటీ జాబితాల్లో తప్పులు సవరించకుండా, ఖాళీలను పూర్తి స్థాయిలో చూపించకుండా జరిపే బదిలీలు ఎవరి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు. విద్యాశాఖ అసమర్థత, అసమగ్ర విధానాలు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఏడాదిన్నరగా సాగతీతకు కారణమైయ్యాయని దుయ్యబట్టారు. అదే ఉపాధ్యాయుల్లో అశాంతికి, అనైక్యతకు దారితీసిందని విమర్శించారు. పాలకుల అస్తవ్యస్త విధానాల కారణంగా రాష్టంలో దశాబ్దకాలంగా పాఠశాల విద్య పతనావస్థకు చేరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధానాలను ఇంకా కొనసాగిస్తే ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. తొమ్మిదేళ్ళుగా పదోన్నతులు, ఆరేళ్ళుగా బదిలీలు లేక విద్యారంగంలో సంక్షోభం నెలకొన్న నేపధ్యంలో పోరాడి సాధించుకున్న షెడ్యూలును విజయవంతంగా నిర్వహించేటందుకు సహకరించాలనే ఉద్దేశ్యంతో చిన్నచిన్న పొరపాట్లు జరిగినా సర్దుకుపోతున్నామని కానీ సాఫ్ట్ వేర్ లోపాలు, సర్వర్ సమస్యలకు తోడు అప్రకటిత రేషనలైజేషన్ బదిలీల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నదని మండిపడ్డారు. లక్షల మంది విద్యార్థులకు వందలాది కళాశాలలు, పదులసంఖ్యలో కోర్సులతో ఇంజనీరింగ్, మెడిసిన్ కౌన్సెలింగులు ఆన్లైలో సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నప్పుడు కేవలం కొన్ని వేలమంది ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ సక్రమంగా నిర్వహించలేకపోవటం ఏమిటని నిలదీశారు. అవసరమైతే ప్రక్రియను రెండురోజులు వాయిదావేసి సమస్యలన్నీ సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. పొరపాట్లను సవరించి పారదర్శకంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## భారత క్రికెటర్లకు బంపర్ బొనాంజ

- రూ.125 కోట్లు ప్రైజ్ మనీ ప్రకటించిన బీసీసీఐ
- టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన భారత జట్టుకు భారీ నజరానా
- రూ.125 కోట్లు ప్రైజ్‌మనీ ప్రకటించిన బీసీసీఐ కార్యదర్శి జైషా
- 11 ఏళ్ల ఐసీసీ ట్రోఫీ నిరీక్షణకు తెరదించిన భారత క్రికెట్ జట్టు

**న్యూ ఢిల్లీ :** టీ20 ప్రపంచకప్ 2024లో ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియాకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ బహుమతిని ప్రకటించింది. 11 ఏళ్ల ఐసీసీ ట్రోఫీ నిరీక్షణకు తెరదించిన భారత జట్టుకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీని ప్రకటించింది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి జైషా సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికా, వెస్టిండీస్ వేదికగా జరిగి ఈ టోర్నమెంట్ అంతటా జట్టు అసాధారణమైన ప్రతిభ, సంకల్పం, క్రీడా నైపుణ్యాన్ని భారత్ ప్రదర్శించిందని ఈ సందర్భంగా జైషా కొనియాడారు. ఈ అత్యుత్తమ విజయానికి కారణమైన ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది అందరికీ అభినందనలు తెలిపారు.

కాగా టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్‌లో భారత్ ఏడు పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ఫలితంగా 11 ఏళ్లుగా ఐసీసీ ట్రోఫీ కోసం భారత్ కొనసాగిస్తున్న నిరీక్షణకు తెరదించింది. 150 కోట్ల మంది ప్రజల్లో సంతోషాన్ని నింపింది. ఈ విజయం పట్ల సంతోషంగా ఉన్న బీసీసీఐ.. ఈ మేరకు ఆటగాళ్ల కోసం భారీ ప్రైజ్‌మనీని ప్రకటించింది.




## రాహుల్.. 2లక్షల ఉద్యోగాలేవీ?

### జాబ్ క్యాలెండర్ ఎక్కడ?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) :** రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ ఏమైందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ స్వయంగా యువతను, నిరుద్యోగులను కలిసి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని ఎక్స్‌వేదికగా కేటీఆర్ గుర్తుచేశారు. అన్ని ప్రధాన పత్రికల్లో పెద్ద ఎత్తున జాబ్ క్యాలెండర్ పేరుతో ప్రకటనలను సైతం విడుదల చేశారని పేర్కొన్నారు. జాబ్‌క్యాలెండర్, ఉద్యోగాల భర్తీని తేదీలతో సహా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని గుర్తుచేశారు. ఇప్పటికే 7 నెలల సమయం గడిచిపోయిందని, కానీ ఒక కొత్త ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ కూడా జారీ కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన 10 నోటిఫికేషన్ తేదీల గడువు ముగిసిపోయిందని పేర్కొన్నారు. మిగిలిన ఐదు నెలల కాలంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఏవిధంగా జారీ చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ తరపున ఎన్నికైన నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో బాధ్యత తీసుకొని స్పందించకపోవడం వల్లనే రాహుల్‌గాంధీని ప్రశ్నిస్తున్నానని తెలిపారు. రాహుల్‌గాంధీ అయినా తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

### సీఎస్ శెట్టికి కేటీఆర్ శుభాకాంక్షలు

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) నూతన చైర్మన్‌గా నియామకం కానున్న తెలంగాణ బిడ్డ చల్లా శ్రీనివాసులు శెట్టికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆదివారం ఎక్స్ వేదిక హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం పెద్ద పోతులపాడు సీఎస్‌శెట్టి స్వగ్రామం. ఎనిమిది నుంచి ఇంటర్ వరకు గద్వాలలో పూర్తిచేశారు.



## సీసీ రోడ్డు ప్రారంభం

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్ 23వ వార్డులోని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సహకారంతో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డును స్థానిక కౌన్సిలర్ మాదాస్ వెంకటేష్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం వార్డులో పర్యటించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ఎల్లవేలలా కృషి చేస్తామన్నారు. అనంతరం కాలనీ సభ్యు లు ఏర్పాటు చేసిన విందు భోజనంలో పాల్గొ న్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంకర్ నాయక్, సీనియర్ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు బాల క్రిష్ణ, నాయకులు నరసింహ, ఫాసి ఉద్దీన్, రాజుగౌడ్, ఉస్మాన్, విఠల్, మహేష్, సందీ ప్, శ్రీనివాస్, రాజేష్, రమేష్, మల్లేష్, శ్రీశైలం, రవి, మాదాస్ ఆదిత్య, మారుతి, భారత్, అతీఫ్, శ్రవణ్, మాన్విత్, మధు, పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** మెట్‌పల్లి పట్టణంలోని ఎస్ఆర్ఎస్పీ ఫంక్షన్ హాల్‌లో 16వ వార్షికోత్సవ నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్స వంలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొ న్నారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైనటువంటి ఇ ల్లెందుల శ్రీనివాస్, కార్యదర్శిగా ఎన్నికైనటువంటి రాకేష్, కోశాధికారిగా ఎన్నికైనటువంటి నాంపల్లి వేణుగోపాల్ శుభాకాంక్షలు తెలియజేశారు.



## 'సింధూ రావ్ బొటిక్' ప్రారంభం

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయభేరి పార్క్ అయాతి కాలేజ్ సమీపంలో సింధు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "సింధూర మ్యాచింగ్ సెంటర్ & బొటిక్" ను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద కుత్బుల్లాపూర్ మండల మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, జిహెచ్ఎంసి డివిజన్ల అధ్యక్షులు రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సామాన్యుడి ఆయుధం
www.telanganaprabha.com



# తన డ్రీమ్ త్యాగం చేసి సినిమాల్లోకి వచ్చిన పాన్ ఇండియా హీరోయిన్

'లోఫర్' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన దిశా పటానీ.. 'కల్కి' మూవీతో ఒక్కసారిగా పాన్ ఇండియా రేంజ్ సొంతం చేసుకుంది. స్టార్ హీరో ప్రభాస్ నటించిన 'కల్కి 2898AD' చిత్రంలో దిశా ఓ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. దీంతో ప్రజెంట్ తెలుగులో 'మట్కా, లక్కీ బాస్కర్', తమిళంలో 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' వంటి సినిమాలతో బిజీగా ఉంది. వీటితో పాటు కోలీవుడ్ స్టార్ సూర్య నటిస్తున్న 'కంగువా' మూవీతో కూడా అలరించడానికి సిద్ధం అవుతుంది. అయితే.. ఇప్పుడు ఇంత స్టార్ స్టేటస్‌తో దూసుకుపోతున్న ఈ బ్యూటీ.. తన డ్రీమ్‌ను త్యాగం చేసి సినిమాల్లోకి రావాల్సి వచ్చిందట. అసలు విషయం ఏంటంటే.. దిశా పటానీ తండ్రి పోలీస్ అధికారి, తల్లి హెల్త్ డిపార్ట్మెంట్ ఇన్స్పెక్టర్, అలాగే అన్న లెఫ్ట్ నెంట్ కల్నల్. దీంతో తను కూడా దేశ సేవలో భాగమవ్వాలనుకుని.. ఆర్మీలో ఫైటర్ జెట్ నడిపే పైలెట్ కావాలనుకుందట. అందుకు అవసరమైన శిక్షణ కూడా తీసుకోగా.. ఫిట్నెస్ పరంగా ఆ ఉద్యోగానికి అర్హ్వారాలు కాలేకపోయిందట. ఇక ఆ తర్వాత సినిమాలపై ఇంట్రెస్ట్ ఉండటంతో తన డ్రీమ్ మధ్యలోనే వదిలేసి.. ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చినట్లు చెప్పుకొచ్చింది దిశా పటానీ.











# పిచ్చుకల్ని ప్రేమించండి

## డాక్టర్ కందేపి రాణీప్రసాద్



వరి చేలలో గింజలేరుకుంటూ; అద్దంలో అందం చూసుకుంటూ; ఇంటి చూరులో సంసారం కిచకిచలాడుతూ విహారం; అంటూ 'మిఠాయి పొట్లం' పొడుపు కథల పుస్తకంలో డా॥ కందేపి రాణీప్రసాద్ పిచ్చుకల కోసం పొడుపుకథను రాశారు. అలాగే "పిచ్చుకా మా ఇంటి కొస్తావా" అంటూ 'సీతాకోక విలుక' అనే గేయాల పుస్తకంలో మాయమై పోతున్న పిచ్చుకల కోసం "వరికంకులు లేవుగాని, పిజ్జాలు పెడతాను వస్తావా" అంటూ రాణీ ప్రసాద్ నేటి పరిస్థితికి అద్దం పట్టే కవితను రాశారు. సెల్ ఫోను తో ఆటలాడే పిచ్చుక పిల్లను పాత్ర ధారిగా చేసి "మనల్ని దారుణంగా చంపేసి ప్రమాద స్థితిలోకి నెట్టివేసే సెల్ ఫోనుల తోనే ఆడతావా" అంటూ పిచ్చిన తల్లితో సెల్ ఫోన్ టవర్లే పిచ్చుకల పాలిటి యమ దూతలు అని చెప్పిస్తూ" పిచ్చుక పిల్లల తప్పు" అనే కథలో చెప్పారు. మానవులతో సహజీవనం చేసే కాకులు, పిచ్చుకలు, కోళ్ళు వంటి మామూలు పక్షుల్ని "పక్షుల అభయారణ్యాలలో చూడవలసిన పరిస్థితి ఏర్పడుతుందని వివరిస్తూ 'సైన్స్ వరల్డ్' పుస్తకంలో సైన్స్ వ్యాసాన్ని రాశారు.

పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని పిచ్చుకల బొమ్మల్ని తయారుచేసి ఎగ్జిబిషన్లు పెట్టారు రాణీప్రసాద్. వంటింట్లో ఉండే ధాన్యపు గింజలతో పిచ్చుక బొమ్మల్ని తయారు చేశారు. ఈ రోజు మనం పిచ్చుకల దినోత్సదం గురించి తెలుసుకుందాం! ప్రతి సంవత్సరం మార్చి 20వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా పిచ్చుకల దినోత్సవం జరుపుకుంటారు. మానవ ఆవాసాల్లో తిరిగే పక్షులకు వాటి జీవనానికి ఏర్పడుతున్న ముప్పు గురించి అందరికీ తెలియాల్సిన అవసరం ఎంతో ఉన్నది బియ్యం చేట పట్టుకుని ఇల్లాలు ఇంటి బయటి కొస్తే చుట్టు పక్కల ఉన్న పిచ్చికలన్నీ ఎదురుగా వాలేవి. బియ్యం చెరిగేటపుడు జారిపోయె ధాన్యం గింజల కోసం ఎదురు చూస్తుండేవి. ఈనాడు బియ్యం చేట పట్టుకుని బియ్యం చెరిగే ఇల్లాలూ లేదు. వాటికై ఎదురు చూసే పిచ్చుకలు లేవు. పూర్వ కాలపు ఉదయాలు పక్షుల కిలకిలా రావాల తోనే మొదలయ్యేది. ఈనాడు అలారం మోతలలో ఫోన్ చేసే రింగ్ టోన్లతో మేలుకుంటున్నారు. అలా మనతో పాటు సహజీవనం చేస్తూ మనం పెట్టినవి తింటూ, మన ఇంటి చూరుల్లో గూళ్ళు కట్టుకుని పిల్లల్ని కంటూ తిరిగే పిచ్చుకలు నేడు కనిపించకపోవటానికి గల కారణాల్లో మానవ తప్పిదాలే ఎక్కవగా ఉన్నాయి. ఆ అవగాహన కొరకే ప్రపంచ పిచ్చుకల దినోత్సవం జరుపుకుంటున్నారు.

పక్షుల మనుగడకు ఏర్పడుతున్న అనేక ఆటంకాలు, వస్తున్న ముప్పుల గురించి ఒకరితో ఒకరు చర్చించుకునేందుకు ఒక రోజు అవసరం అయినందున పిచ్చుకల దినోత్సవానికి ఒక రోజును ఏర్పాటు చేయాలని పర్యావరణవేత్తలు అనుకున్నారు. పక్షుల పరిరక్షణకు ఒక వేదిక కావాలని, ఒకరి అభిప్రాయాలు మరొకరితో పంచుకునే ఉమ్మడి వేదిక అవసరమని పక్ష శాస్త్రవేత్తలు భావించారు. దీనికి అందరూ ఆమోదయోగ్యం తెలిపారు. ఫలితంగా తొలిసారిగా 2010 వ సంవత్సరంలో 'పిచ్చుకల దినోత్సవాలు' ప్రపంచంలో అనేక చోట్ల జరిగాయి. ఆ రోజన పిచ్చుకల జీవన విధానం గురించి సదస్సులూ, వాటికి ఉన్న అనుకూల వాతావరణం, అననాకూల పరిస్థితులు, పిచ్చుకలు చనిపోవడానికి కారణమవుతున్న సెల్ ఫోన్ టవర్ల గురించి అనేక అవగాహనా కార్యక్రమాలు జరుగుతాయి. కళలకు సంబంధించిన పోటీలు ఉపన్యాసాలు, పిచ్చుక బొమ్మల ఊరేగింపులు రకరకాలుగా ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు జరుగుతాయి. హైదరాబాదు లోని కెబిఆర్ పార్కులోనూ పిచ్చుకల దినోత్సవాన్ని జరుపుతారు. పిచ్చుకల ఫొటోలను చెట్లకు కట్టి పిచుకమ్మలపై పాటలు పాడుతూ ఉత్సవాల్ని జనరంజరంగా నిర్వహిస్తారు. ఇంకా స్కూళ్ళలో వీటి గురించి తెలియజేస్తూ విద్యార్థులతో సైతం అనేక బొమ్మలు, వ్యాసాలు రాయిస్తూ అందరి మనస్సుల్లోకీ చొప్పించేలా ప్రయత్నంచాలి.

భారతీయ ప్రకృతి పరిరక్షకుడైన మహమ్మద్ దిలావార్ పిచ్చుకల పరిరక్షణ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. 'నేచర్ ఫర్ సొసైటీ' అనే సంస్థను స్థాపించాడు తద్వారా అనేక రకాలుగా పిచ్చుకలను రక్షించడానికి వీలైన అవకాశాల్ని అందరితోనూ పంచుకున్నాడు. సొసైటీ కార్యాలయంతో తోటి సభ్యులతో మాట్లాడుతున్నపుడు పిచ్చుకల కోసం ఒక రోజును కేటాయించుకుంటే ఎలా ఉటుంది అనే ఆలోచన వచ్చింది. అలా పిచ్చుకల దినోత్సవం ఏర్పడింది. ఇది కేవలం పిచ్చుకలను రక్షించడమే కాకుండా జీవ వైవిధ్య ఆశయాలను నెరవేర్చడం కోసం కూడా ఉపయోగపడుతుంది. ఈ విధంగా పిచ్చుకల దినోత్సవానికి ఆద్యుడైన మహమ్మద్ దిలావర్ కు "హీరోస్ ఆఫ్ ద ఎన్విరాన్ మెంట్" లో ఒకరుగా గుర్తించి, వీరి న కృషిని అందరికీ తెలిపింది 'టైమ్'. ఆ తర్వాత పిచ్చుక పురస్కారాలను కూడా ఇవ్వడం ప్రారంభించారు.

2011 వసంవత్సరం నుంచి పిచ్చుక పురస్కారాలను అందజేయడం ప్రారంభించారు. 2011 లో భవిన్ షా, నరేంద్రసింగ్ చౌదరి, ఎల్. శ్యామల్, ద స్పారో కంపెనీ అనే నలుగురికి ఈ అవార్డు నిచ్చి సత్కరించారు. ఎన్.ఐఫ్.ఎస్ అనే సంస్థ మొదటి సారిగా ప్రజలలో అవగాహన పెంచుట కొరకు పిచ్చుక పురస్కారాలను ఏర్పాటు చేసింది మొదటిసారిగా గుజరాత్ రాష్ట్రంలోని అహమ్మదాబాద్ లో మార్చి నెలలో 20 వ తేదీన ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. అప్పటి నుంచి వరసగా ఈ పురస్కారాలను అందజేస్తూనే ఉన్నారు. మోహన్ గార్గ్, ఎన్. షహజాద్ & ఎం.సాద్, జల్ గ్రాహన్ కామేటి, ప్లిప్లాంట్రి లకు 2014 వ సంవత్సరానికి గాను పిచ్చుక పురస్కారాలను అందజేశారు.

గ్రామాలలో పొలాల్లోని గింజలు ఏరుకుని తింటూ కిచకిచమని అరుపులతో ఉదయాన్నే ఆందర్నీ లేపుతూ మానవులతో పాటు జీవనం సాగించేవి. తల్లి తెచ్చే ఆహారం కోసం తమ బుల్లి నోర్లు తెరుచుకుని ఎదురు చూస్తూ ఉండే పిల్లల్ని మనం చూడలేకపోతున్నాం. ఎండు కొమ్మలు, రెమ్మలు, మెత్తటి గడ్డ పీలికలు వంటి వాటితో గూడును ఏర్పరచుకుని భద్రంగా తన గుడ్లను పెట్టుకుని పొదుగుతాయి. పిచ్చుకలు ఎర్రటి నోర్లు తెరుచుకుని తల్లి తెచ్చిన గింజల్ని లాక్కోవడానికి తోటి పిచ్చుక సోదరులలో పోటీపడే అద్భుత దృశ్యాల్ని చూసే అదృష్టం ఈనాటి బాల్యానికి లేదు. తొట్టి దగ్గర కాళ్ళు కడుక్కుని వస్తే ఆ నీళ్ళను తాగుతూ తమ దాహాన్ని తీర్చుకునే పక్షులే లేవు. పిచ్చుక పిడకలిల్లు కట్టుకుంది, కాకి కర్రలిల్లు కట్టుకుంది అని కథలు చెప్పే బామ్మలూ లేరు. పిచ్చుకలతో అనుబంధం ఈ నాటి తరానికి పూర్తిగా తెగిపోయింది. పిచ్చుకల ఆత్మ ఘోషను వినిపించడానికే రోబో సినిమాను అద్భుతంగా తెరరెక్కించారు ఇక ముందు పిచ్చుకలను చంపే ప్రయత్నాలకు అడ్డుగా నిలవాలని, పిచ్చకలను ప్రేమించి పర్యావరణంలో వాటి పాత్రను అవి పోషించేలా చేయాలని కోరుకుందాం!.

